# నిజం కాని ఒక్క నిజం కథ

గొర్లు మళ్లించిన చేను. చేలో గొర్ల కాపరుల అదిలింపులు; గొర్లమంద అరుపులు; గొర్ల గూళ్ల కిందకు తోలిన గొర్రె పిల్లల పిల్లగొంతుల ఆరాటాలు. గొర్లు మళ్లించిన చేను గట్టును ఆనుకొని చీని తోట. ఆ తోట బావి దిన్నె మీద గుడిసె. గుడిసెలో పొగతో పాటు కొంచెం వెలుగునిస్తున్న కిరసనాయిలు బుడ్డి. చీకటి గాలిలో కన్పించని చీనీ చెట్ల కదలికలు; విన్పిస్తున్న ఆకుల గుసగుసలు. గాలి వెదజల్లుతున్న చీనీ చెట్ల పూత వాసనలు.

గుడిసె బయట కుక్కిమంచం. మంచంలో కూలబడి బీడీ కాల్చుకుంటున్న వెంకటపతి రాజు.

"ఓ రాజంపేట మామా! మామా! తలుపు తీస్తువురా" అనే పిలుపు వెంకటపతిరాజుకు విన్పించింది. ఆ గొంతు ఎవరిదో వెంకటపతిరాజు గుర్తించాడు. ఆ గొంతు పక్క చేలల్లో గొర్లు మళ్లిస్తున్న గుంపులోని చిన పక్కీరయ్యది. సంసారమూ పిల్లాపీచూ లేని వెంకటపతిరాజుకు బాగా మాలిమి అయ్యాడు, చిన్న పక్కీరయ్య వారం రోజులుగా.

"ఉండరా, నాయాలా!" అంటూ దిన్నె దిగి, తోట చెక్కతలుపులకు వేసిన ఇనుప బొంగు గడెమాను తీసి "రా" అని పిలిచాడు.

పదేళ్ల చిన్న పక్కీరయ్య వెంకటపతిరాజు వెంట, తల్లి గొర్రె వెంట నడిచే పిల్ల గొర్రెలా నడిచాడు. దిన్నె మీది గుడిసెముందు కుక్కిమంచంలో వెంకటపతిరాజు కూర్చోగానే తానూ పక్క కూర్చున్నాడు; తన గోడు చెప్పుకున్నాడు:

"మామా! రాత్తిర్లు ఈ గొర్ల కావిలితో చస్తున్నా, నాయన వదిలి పెట్టడు. అన్నా వాళ్లేమో తిడతారు. అందరికీ అగ్గువ. ఇంట్లో పిల్లోణ్ణి నేనే అయితి".

"పనీపాటా చెయ్యకుండా బతకలేం కదరా అల్లుడా?" వెంకటపతిరాజు అప్యాయంగా పక్కీరయ్య జుట్టు నిమిరాడు.

"ఏం పనో, ఏం పాడో? సదువుకుంటానంటే గొర్లున్నాయంటారు. కతలు విందామంటే 'పని' 'పని' అంటారు. గట్టిగా అడిగితే, 'పెద్దయిందాకా ఈ మంద చూసుకో. తర్వాత సిమెంటు ఫాక్టరీ పనికి పో' అంటారు", చిన్న పక్కీరయ్య అటూ ఇటూ కలయచూస్తూ, తొడలు గోక్కుంటూ తన గోడు చెప్పుకున్నాడు. దూరంగా చీకట్లో చిమ్మిన వెలుగును చూసి అరిచాడు:

"మామా. కొరివి దయ్యాలు!"

"అరే నాయాలా! అవేం చేస్తాయి? దయ్యాల నడుమే మన కాపురం; మన బతుకు. పిల్ల కాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ? ఆ మాటకొస్తే దయ్యాలు మనుషులకంటే మంచివి.... నేను ఏకంగా దయ్యంతోనే కాపరం చేసినా", వెంకటపతిరాజు అన్నమాటకు చిన్న పక్కీరయ్య "ఆఁ" అని నోరు తెరిచాడు.

వెంకటపతిరాజు చీకటి శబ్దాలు వింటూ నింపాదిగా మొదలు పెట్టాడు:

"వారం దినాలుగా 'కత', 'కత' అంటూ నన్ను చంపక తింటావుండావు. ఈ పొద్దన్నా కత చెప్తా విను. ఎట్లాగా ఈ రాత్రి చీని చెట్లకు మడవగట్టే పనిలేదు. ట్రాన్సుఫారం కాలిపోయిందంట! కిరసనాయిలు అయిపోయిందాక, ఆ బుడ్డే మనకు గతి. బ్యాటరీ లైటు చెడిపోయింది. సరే నా అన్నం అయిందిగానీ నువ్వు తినే వచ్చినావా?"

"తిన్నా. చెప్పు, చెప్పు కత. పురసత్తు ఎట్లాగా దొరికింది. నీ దయ్యం కతే చెప్పు. నువ్వున్నావ్. నాకేం బయం మామా!" - చిన్న పక్కీరయ్య ఉత్సాహంగా వెంకటపతిరాజును వాటేసుకున్నాడు.

వెంకటపతిరాజు ఆరిపోయిన బీడీ ముక్కను మళ్లీ అంటించాడు. బీడీని బొటనవేలు, మధ్య వేలు మధ్య పెట్టుకొని ఒక పీల్పు పీల్చాడు - జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటూ: "ఇదిగో పక్కీరూ! కత బాగా విను. నడుమ నడుమ అడ్డం రావద్దు- తోలు బొమ్మలాటలో కేతిగాడు, బంగారక్క మాదిరి. నాకు తిక్కరేగుతుంది", అన్నాడు. ఆ తిక్క ఎందుకో చిన్న పక్కీరయ్యకు అర్థంకాలేదు. "సరే రాన్లే" అన్నాడు.

వెంకటపతిరాజు కథను చెప్పుకపోయాడు:

"అన్నీ పోగొట్టుకొని, బుట్టాపక్కీరై ఈడికి రాక చానా రోజుల ముందు... ఈ రెడ్డేరి తోటలో కావిలి పనికి కుదురుకోక చానా ఏండ్ల ముందు... నాకప్పుడు ముప్పయేండ్లు పైనే వుంటాయి. మా ఊళ్లో మాకు రెండెకరాల సన్న నిమ్మ చెట్లు, ఒక ఎకరా అరటి చెట్లు వుండేవి. అసలు పక్కీరూ! అప్పటికి మిగిలింది మూడెకరాలే... కానీ మాది చానా పెద్ద వంశంలే. మట్లి వంశం అంటార్లే... తిరపతిగోపురం కట్టించింది మా వాడే. ఆ కొండ మెట్లు వేయించింది మా వాడే... సిద్దవటం కోట కట్టింది మా వాళ్ళే నంట. ఇప్పటికీ ఊర్లకు ఊర్లు మా వాళ్ళవే. చెయ్యేరు చుట్టుపక్కల - అవన్నీ పోయినావనుకో. రాజుల సొమ్ము రాళ్ళపాలు. అంతే.

"మా వంశంలో మా ముత్తాత ఒక రోజు కుర్చీలో కూర్చొని వీధిలో వచ్చేపొయ్యే వాళ్ళను చూస్తా వున్నాడంట! బాగా మేపిన పందెం పుంజును తీసుకొని బలిజరాముడు వీధిలో పోతా ఉండాడంట! మా ముత్తాత కేకవేస్తే వాడొచ్చి, వంగి వంగి దండాలు పెట్టినాడు. 'కోడిని ఇచ్చిపోరా' అన్నాడంట మా ముత్తాత. 'సామీ. ఇది పందెం కోడి. ఇప్పటికి నాలుగు పందాలు గెలిచింది. ఇదే నాకు ఆదరువు' అన్నాడంట రాముడు. 'పోరా! అయిదెకరాలు ఇనాం రాసిస్తా

పో. మా వంటవాడికి ఇచ్చిపో...' అన్నాడు మా ముత్తాత. అట్లాంటిది మా వంశం, మా రక్తం. మా రాజ్జెం పోయింది. పొయ్యింది పోగా మిగిలింది మూడెకరాలు, ఒక బోదకొట్టం" వెంకటపతిరాజు నిట్టూర్చి ఆరిపోయిన బీడీని మళ్ళీ అంటించుకున్నాడు.

చిన్న పక్కీరయ్యకు వెంకటపతిరాజు రాజరక్త కథ నచ్చలేదు. వాడికి నడిచే కథ కావాలి. 'నీయమ్మ ఏం కతరా!' అనిపించాలి. నోరు తెరిస్తే నిజంగా తంతాడేమో అనే భయంతో; దమ్ము లాగుతున్న వెంకటపతిరాజు తొడను పట్టుకొని చిన్న పక్కీరయ్య ఊపాడు.

వెంకటపతిరాజు కథ లోకంలోకి వెళ్లాడు:

"ఆ ఏడు దండిగా వానలు పడినాయి. నిమ్మ చెట్లకు-చెట్టు చెట్టుకూ-పూత విరగబూసింది. ఈ చీని చెట్ల పూత ఇదేం పూత. ఆ పూత పగటి ఎండ మాదిరి అనుకో. ఆ పూత వాసన- ఇంత కంటే బ్రమ్మాండం. తోటలో ఒక్కణ్ణే మడవ గడ తాండా-పూతకు మురిసిపోతూ.

"గల్లు గల్లు గల్లు... కాలి గజ్జెల మోత... కణా కణా కణా... చేతి కంకణాల మోత..... దగ్గరగా విన్పించింది. ముందుగా వచ్చేది నా పెండ్లామనుకున్నా. నా పెండ్లానికి కాలి గజ్జెల్లేవు. చేతులకు కంకణాల్లేవు. వాళ్ళమ్మావాళ్ళు పెండ్లప్పుడు చేయించలేదు. నేనూ చెయ్యించలేదు. దానికితోడు మా ఆడదాన్ని పుట్టింటికి తరిమికొట్టినాలే.... అది వేరే కథ. ఆడోళ్ళతోనే మొగోళ్ళకు తిప్పలు..."

"ఒరే అల్లుడూ! ఆడోళ్ళు లేకపోతే మొగోళ్ళకు ఆ సుకం వుండదు. నీయమ్మ దాని కోసం ఎన్ని తిప్పలురా నాయనా... ఆ అసలు కత కొస్తా... నిమ్మచెట్ల పాదుల నడమ కాలవలో ఆ గల్లు గల్లు కణా కణా వస్తా కన్పించింది. అబ్బ. పుల్లంపేట ఎర్రంచు తెల్లని చీర కట్టుకోని దేవతలాగా వయసులో వున్న ఆడమనిషి ఎక్కడో చూసినట్లు గుర్తు..."

'దయ్యాలన్నీ తెల్లకోకలే ఎందుకు కట్టుకుంటాయో-ముండమోపుల్లాగా. అసలు ముండమోపులైనా తెల్లకోకలెందుకు కట్టుకోవాలో?' పక్కీరయ్యకు కథల మామను అడగాలని నోటిదాకా వచ్చింది. తాను చూసిన సినిమాలో కూడా దయ్యం తెల్లకోక కట్టుకోవడం చిన్న పక్కీరయ్యకు గుర్తుకొచ్చింది. దయ్యం కాని హీరోయిను మొదటిరాత్రి భర్త గదిలోకి తెల్లకోకతో రావడం గుర్తుకొచ్చింది. ఆ తర్వాత డాన్సు పాటలో హీరోయిన్ చెలికత్తెలు ఇరవై ముప్పయి మంది పసుపుపచ్చ చీరల్లో ఎగరడం గుర్తుకొచ్చింది. వాడు మంచంలోంచీ లేచి నిక్కరు పైకి లాక్కున్నాడు.

"కూర్చో. వింటాండావా?" వెంకటపతిరాజు, చిన్న పక్కీరయ్య భుజాలు కుదుపుతూ అడిగాడు.

"ఊ ఊ" అన్నాడు వాడు.

"ఆ పిల్ల.... పక్కీరూ! మా రాజుల ఇండ్లల్లో క్క్యాడా అట్లాంటి మనిషి ఉండదనుకో. మా మట్లి రాజు, కిష్ణదేవరాయల కూతుర్ని చేసుకున్నాడని అంటారు. ఆమె కంటే ఈ పిల్ల వెయ్యొత్తులు పైన' అని తర్వాత మా ఊళ్ళో బట్రాజు అన్నాడనుకో.... చామనచాయ అయితేనేం? సినిమావాళ్లు ఆ పిల్ల వెంట్రుకకు సరిపోరనుకో... అదే నా కొంప ముంచింది.

"నిజ్జెం చెప్తా అల్లుడా! ఆ ఆడమనిషి మా కాలవలో నడచి దగ్గరకు వచ్చినప్పుడు భయపడినాననుకో. 'ఏ ఊరు? ఎందుకు మా తోట్లోకి వచ్చినావు?' అన్నా జబర్దస్తీగా.

"ఆ ఆడమనిషి తన గోడు చెప్పింది. జమ్మలమడుగు దగ్గర. కొట్టాలపల్లె వాళ్ళ

ఊరంట. పారిటిలో బాంబులు వేసుకున్నారు. అందరితోపాటు కట్టుకున్న మొగుడు చచ్చిపోయినాడు. దిక్కులేక దేశాలు పట్టుకొని వచ్చినానని చెప్పింది. స్టేషను దిగి మా పల్లె దారిన వస్తా వుంటే, తోట కన్పిస్తే, మనిషి తోడు దొరకదా అని వచ్చిందంట! జాలేసింది. దానికి తోడు మాటా మాటా రంజుగా కలిసిందిలే... అంతే... మా ఇంట్లో నేనే ఒంటిపీరుగాణ్ణిగదా? నాకు ఆడతోడు కావాల. తోడైంది. ఇంటికి తీసుకపోయినా. నాకు తను జోడు. నేను తనకు తోడు."

"పనిలోకి దిగితే, ముగ్గురు మొగోళ్లు చాలరనుకో. సేద్యం తప్ప అన్ని పనులూ చేసేది. కలుపు తీసేది. గడ్డి దోకేది. కాలవలు చెక్కేది. పాదులు చేసేది. ఇంజను తనే ఆడించేది. మడవ గట్టేది. కల్లంలోకి పోయి మేత తెచ్చేది. వంట రుచిగా చేసేదనుకో....ఆ ఇస్పీడు. తెగవ చూసి 'ఆడదా? దయ్యమా' అనిపించేది. ఎవరైతే నాకేం భయం?"

"ఈ మనిషితో కాపరం పెట్టినాక, నా పెండ్లాం తరపు మనుషులొచ్చి రాజీ అన్నారు. మగోడి పక్కకు చేరడానికి బయపడే ఆడమనిషితో ఏ మొగుడు కాపరం చేస్తాడు? కుదర్దు పొమ్మన్నా. ఈ కొత్తామెను తిట్టి తిట్టి వాళ్లు వెనక్కి పొయ్యారు."

"నా కాపరం బాగా సాగింది -ఆర్నెళ్లు. అదేందోకానీ, నా ఒంట్లో బాగుండేది కాదు. అందరూ 'చిక్కి పోతాండాడు; చిక్కిపోతాండాడు' అన్నారు. మా పల్లెలోని నాటు డాక్టర్ని అడిగితే 'ఆడమనిషిని కలిసేది తగ్గించు' అన్నాడు.

"ఇదిట్లా ఉంటే మా టంగుటూరి నాయుడితో మాకు తకరారు వచ్చింది. మా అరటితోట పక్క తోటే నాయుడిది. ఒకరోజు నాయుడి మేకపోతు మా తోటలోకి జొరబడింది. - అదీ పట్టపగలు. నాలుగు అరటిచెట్లూ, వాటి గెలలూ మేసింది. అది అసలే దయ్యం మేక. మా ఆడమనిషి దాన్ని చూసి తరిమింది. నడి బజార్లో నాయుణ్ణి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. పైగా నాయుడితో గట్టు తకరారుండనే ఉంది. నాయుడు పార్టీ గట్టినాడు. నా గుండె గుబేల్మంది. మా పక్క అరుచుకుంటాం. మోసాలు చేసుకుంటాం. గలాటా చేసుకుంటాం. మాటొస్తే ఖూనీలకు దిగం. మాది చిత్తూరు సాలు. ఆర్లగడ్డ, జమ్మలమడుగు, పులివెందుల, సాలు కాదు."

"మా ఆడమనిషి నాకు ధైర్యం నూరిపోసింది. యాడ నుంచి తెచ్చిందో ఒక పిస్తోలు తెచ్చి, బొడ్లో పెట్టుకుని తిరగమంది. ఇంట్లోనే బాంబులు చెయ్యించింది. ఏం మాయ చేసిందో బోయోళ్లు మా వైపు తిరిగినారు. 'మట్టి ఆయానా, మజాకా' అని పొగిడినారు. నాయుని మీద బాంబు కూడా వేయించింది. పారిటీ దెబ్బకు నా ఆస్తి పోయింది. నాయుడిదీ పొయ్యింది. ఆస్తున్నంత వరకే ఎగుర్లాటలు. తర్వాత రాజీ అయినా మనకో ....."

"నేను సన్న నిమ్మకాయల యాపారం మొదలుపెట్టినా. ఒకమారు బెంగుళూరికి పొయినా - నిమ్మకాయల సంచుల్ని నేనే తీసుకొని. వారం తర్వాత బెంగులూరి నుంచి దిగేసరికి మా ఊల్లోఒకటే పుకారు... వినని చెవి లేదు; నన్నగడని నోరులేదు. అందరికీ అదవయినా. ఆలి సచ్చినోడు అందరికీ అదవ. నా పెండ్లాలు ఉండగానే నేను అదవ."

"నా పెండ్లాం 'దయ్యం దయ్యం' అని అందరూ అనేవాళ్లే. ఎవరెవరో ఏందేందో చెప్పినారు. జమ్మలమడుగు దగ్గర కొట్టాలపల్లెలో బాంబులు వేసుకున్నప్పుడు ఆ మనిషి నిజంగా చచ్చిందన్నారు. దయ్యమై వచ్చిందన్నారు. వాళ్ల ఊరి మనిషి అని ఒకణ్ణి తోడుకొని వచ్చి, నాకు చెప్పించినారు. రాత్రి పూట నల్లకోళ్లు మాయమైనాయంట. ఆ నల్లకోళ్ల బొచ్చు మా కొట్టం వెనక దొరికిందంట. నల్లమేకలు మాయమైనాయంట. రక్తం పీల్చిన మొండాలు

దొరికినాయంట. ఒకరాత్రి ఒలుకల్లో మా ఆడమనిషిని చూసినారంట. ఎవరో ఆడామె ఒక రాత్రి మా ఇంటి కొచ్చి తలుపు దట్టిందంట! ఈ మా ఆడమనిషి తలుపు తియ్యలేదంట. ఆ. వచ్చినామె తలుపు సందుల్లో నుంచీ చూసిందంట. నట్టనడింట్లో కుంభం రాశిపోసుకుని నేనుంచుకున్న ఆడమనిషి తింటా ఉందంట. వచ్చినామె మర్నాడు రక్తం గక్కుకుని చచ్చిపోయిందంట. అన్నీ ఇట్లాంటి కతలు చెప్పినారు. ఇదేంది భగవంతుడా? అని దిగులుపడి చచ్చినా."

"నాలుగైదు రోజులు మా ఇంటి పక్కకే నేను పోలేదు. ఐదోరోజు నా నోట్లోంచి రక్తం పడింది. మంత్రగాడి దగ్గరకు తీసకపోయినాడు ఒక బోయ నేస్తుడు. 'నువ్వు దయ్యంతో కాపురం చేస్తాఉండావు. అది రక్తం పీల్చింది. మిగిలింది పడతా ఉంది' అని మంత్రగాడన్నాడు. 'ఏం చెయ్యాలన్నా?'; 'దాన్ని ఇంట్లోనుంచి వెళ్లగొట్టాల. దాని దగ్గర మంత్రాలు పారవు. అది బాంబు వేసినప్పుడు చచ్చింది'అన్నాడు.

"నేను ఆలోచన చేసినా. 'దయ్యమిచ్చిన పిస్తోలుకు మాయ వుంటుంది' అని ఆలోచన చేసినా. ఇంట్లోకి వెళ్లినా. వంట చేస్తోంది. అదే ఎర్రంచు తెల్లచీర కట్టుకుంది. ఒక దెబ్బతో వెనకునుంచి కాల్చినా........."

శ్వాస ఎగదీసుకుంటూ చిన్న పక్కీరయ్య వెంకటపతిరాజును అడిగాడు:

"అయితే మామా....చచ్చిందా? దయ్యం ఒకసారి చచ్చినాక మళ్లీ దయ్యమై వేరే వాళ్లకు పడుతుందా?"

తోటకు పడమటి వైపు వేసిన కంప కంచెను నుగ్గు నుగ్గుగా తొక్కుతూ తోటలోపడి జొరబడి వస్తున్న ఎనుముల అలికిడి విన్న వెంకటపతిరాజు చిన్న పక్కీరయ్య ప్రశ్నను పట్టించుకోలేదు. లేచి కర్ర అందుకున్నాడు. వాటిని తరిమి కొట్టడానికి పరుగెత్తాడు.

విన్న కథను తలచుకుంటున్న కొద్దీ, చిన్న పక్కీరయ్య భయపడిపోసాగాడు. పెద్దయ్యాక ఏ ఆడదయ్యమో తనను తగులుకుంటుందని వణికిపోయాడు.

దిక్కులు చూశాడు. గడిసెలోని బుడ్డీ ఆరిపోయింది. దక్షిణం దిక్కులో చాలా దగ్గరగా మరో వెలుగు పైకి చిమ్మింది. అది చూసి, ముసుగుకప్పుకొని, చిన్న పక్కీరయ్య గట్టిగా కళ్లుమూసుకున్నాడు. ఉన్నట్టుండి పక్కీరయ్యకు దిగులు ముంచుకొచ్చింది. 'ఆడామెను చంపటం పాపం ...... దయ్యమైనా చంపటం పాపం.....పాపం' అనుకుంటూ ఆందోళనలో పడ్డాడు.

వెంకటపతిరాజు చీని తోటలోకి వచ్చిన గొడ్లను చీకట్లోనే దూరంగా తరిమి కొట్టాడు. ఆ పరుగుల శబ్దాలు లేవు. చిన్న పక్కీరయ్యకు చెప్పిన కథ రేపిన అశాంతితో, అలసటతో కాళ్లీడ్చుకుంటూ వెంకటపతిరాజు దిన్నెవైపు కదిలాడు. పక్కచేలోని గొర్ల కాపరుల అదలింపులు లేవు. గొర్లమంద అరుపులు మణిగాయి. చేలోని గొర్ల గూళ్ల కిందికి తోలిన గొర్రె పిల్లలు మాత్రం ఇంకా 'బ్యా' 'బ్యా' 'బ్యా' అంటూనే ఉన్నాయి. సన్నటి గొంతులతో - ఇంకా అలవాటు కాని ఆ చీకటి అలికుడుల్లో. ○

**సెప్టెంబరు 1995, సరి కొత్తకథ సంకలనకర్త; వేదగిరి రాంబాబు.**

**● నవంబరు 1995, రచన సచిత్ర మాసపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక. ●**